క్లుప్తంగా

మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు



తిరువూరు: లైసెన్సు లేకుండా, మైనారిటీ తీరకుండా వాహనాలు నడిపేవారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తిరువూరు ఎస్ఐ సత్యనారాయణ హెచ్చరించారు. తిరువూరు బైపాస్‌రోడ్డు జంక్షన్‌లో ఆదివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. పలువురు మైనర్లు ద్విచక్ర వాహనాలు నడుపుతుండగా కేసులు నమోదు చేశారు. వాహన చోదకులకు రోడ్డు భద్రతా చట్టాలపై ఎస్ఐ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎస్ఐ మాట్లాడుతూ మైనర్లు వాహనం నడిపితే తల్లిదండ్రులే బాధ్యత వహించాలన్నారు. తిరువూరు పట్టణ ప్రధాన రహదారుల్లో బైక్ రేసింగ్‌లు, అపరిమిత వేగంతో వాహనాలు నడిపే వారిపై నిఘా ఉంచామని, వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

దివ్యాంగులకు కృత్రిమ కాళ్లు అందజేత



ఆగిరిపల్లి: మండలంలోని తోటపల్లి హీల్ అవయవ కేంద్రంలో దాతలు కాకర్ల శంకరరావు, నాగళ్ల కృష్ణమోహన్, డాక్టర్ అడుసుమిల్లి ప్రతాప్ కుమార్ అందజేసిన ఆర్థిక సహాయంతో ముగ్గురు దివ్యాంగులకు ఆదివారం కృత్రిమ కాళ్లను అందజేశారు. హీల్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కోనేరు సత్యప్రసాద్ మాట్లాడుతూ దివ్యాంగులకు దాతల ఆర్థిక సహాయంతో కృత్రిమకాళ్లను అందజేయడం అభినందనీయమన్నారు. హీల్ సంస్థ సీఈఓ కూరపాటి అజయ్ కుమార్, డాక్టర్ వెంకటరావు, కృత్రిమ అవయవ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదాలకు నిలయంగా రోడ్డు మార్జిన్



చాట్రాయి: రోడ్డు పక్కన ఎత్తయిన పొదలతో కనిపించని రోడ్డు మార్జిన్ ప్రమాదాలకు నిలయంగా మారింది. మండలంలోని చనుబండ, కృష్ణారావుపాలెం గ్రామాల మధ్య చిన్న చెరువు కట్ట ఆర్అండ్‌బీ రోడ్డు పక్కన పొదలు ఉండటంతో మార్జిన్ తెలియక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రోడ్డు నుంచి ఇతర రాష్ట్రాలకు చెందిన భారీ వాహనాలు, బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ రోడ్డుకు ఒక పక్క చెరువు, రెండో పక్క పొదలతో రోడ్డు మార్జిన్ కనిపించని పరిస్థితి. వేగంగా వస్తున్న వాహనాలకు మార్జిన్ తెలియక నెల కిందట ఆటో- ద్వి చక్ర వాహనం ఢీ కొన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకుండా పొదలు తొలగించి ఐరన్ బారికేడ్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా సత్యసాయి బాబా పల్లకీ సేవ



జి.కొండూరు: ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలం సున్నంపాడు గ్రామంలో పుట్టపర్తి సత్య సాయిబాబా వారి శత జయంతి వేడుకలను ఆదివారం భక్తులు ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా పల్లకీ సేవను భక్తులు పెద్ద ఎత్తున నిర్వహించారు. విజయవాడ పట్టణంలోని శ్రీ సత్యసాయి సేవా సమితి, సీతారామపురం వారి ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. శ్రీ సత్యసాయిబాబా మందిరం అయిన పుట్టపర్తి నుంచి నిర్వాహకులు శ్రీ సాయిబాబా వారి పాదుకలు తీసుకువచ్చి సున్నంపాడు గ్రామంలో ఊరేగించారు. గ్రామంలోని స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేసి అనంతరం దివ్యాంగులు, వృద్ధులు 23 మందికి నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. పదాధికారులు, గ్రామ పెద్దలు, సేవాదళ్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

15 మంది జూదరుల అరెస్టు

విస్సన్నపేట: పేకాట శిబిరాలపై ఆదివారం పోలీసులు దాడిచేసి 15 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ జి. రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పుట్రేల గ్రామ పంచాయతీ కోటివల్లి గ్రామంలో పేకాట శిబిరంపై దాడి చేసి 9 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.3,710 నగదు, 6 బైకులను స్వాధీనం చేసుకున్నారు. అలాగే పుట్రేల గ్రామంలో పేకాట శిబిరంపై దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.3,120 నగదు, ఐదు బైకులను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఏడాదిన్నరగా సగం రోడ్డే!

- ఆరువందల మీటర్ల మేర రోడ్డు అధ్వానం
- కవులూరు, శాంతినగర్ రహదారిపై భారీ గుంతలు
- గత ప్రభుత్వంలో మంజూరైన నిధులతో కొంతమేర సీసీ రోడ్డు నిర్మాణం
- ఏడాదిన్నరగా నిధులు మంజూరు చేయని కూటమి ప్రభుత్వం



కవులూరు, శాంతినగర్ రోడ్డుపై ఏర్పడిన భారీ గుంతలు



గత ప్రభుత్వంలో మంజూరైన నిధులతో సగం వరకు నిర్మించిన సీసీ రోడ్డు

జి.కొండూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర కాలంలో రహదారులు అధ్వానంగా మారాయి. రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మంజూరైన నిధులతో సగానికిపైగా రోడ్డు వేసి మిగిలిన రోడ్డును అలానే వదిలివేయడంతో వాహన చోదకులు నిత్యం నరకయాతన పడుతున్న ఘటనలు కవులూరు, శాంతినగర్ రహదారిలో కళ్లకు కట్టినట్లు కనిపిస్తున్నాయి. ప్రభుత్వం వెంటనే స్పందించి మిగిలిన రోడ్డును కూడా పూర్తి చేస్తే తమకు ఇబ్బందులు తప్పుతాయని స్థానికులు చెబుతున్నారు.

రోడ్డు నిర్మాణాన్ని సగంలోనే ఆపేశారు

కవులూరు నుంచి శాంతినగర్ మీదుగా కొండపల్లి వెళ్లే ప్రధాన రహదారి కవులూరు జెడ్పీ హైస్కూలు నుంచి శాంతినగర్ వద్ద బుడమేరు డైవర్షన్ కెనాల్‌పై ఉన్న వంతెన వరకు 1.4 కిలోమీటర్లు పొడవు ఉంది. ఈ రహదారి అప్పట్లో సగం వరకు ధ్వంసమవడంతో రహదారి నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో రూ.60 లక్షల నిధులు మంజూరు చేశారు. ఎన్నికల సమయంలో ఈ రహదారి నిర్మాణ పనులు ఆగిపోయాయి. ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత ఏడాది ఆగస్టులో బుడమేరుకు వచ్చిన వరదలతో డైవర్షన్ కెనాల్‌కు గండ్లు పడి ఈ రహదారి కోతకు గురై భారీ గుంతలు ఏర్పడ్డాయి. రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్న నేపథ్యంలో గత ప్రభుత్వంలో మంజూరైన రూ.60 లక్షల నిధులతోనే 800 మీటర్ల మేర కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీసీ రోడ్డును నిర్మించి వదిలేశారు. మిగిలిన ఆరు వందల మీటర్ల రహదారి నిర్మాణానికి ఏడాదిన్నర కాలంగా కూటమి ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో రహదారి అధ్వానంగా మారి కవులూరు గ్రామస్తులు రాకపోకలకు నరకయాతన పడుతున్నారు.

ప్రధాన రహదారిగా..

కవులూరు గ్రామస్తులు ఈ రహదారిలోనే శాంతినగర్, కొండపల్లి మీదుగా ఇబ్రహీంపట్నం వెళ్తుంటారు. కవులూరు గ్రామానికి చెందిన రెండు వేల ఎకరాలకు పైగా సాగు భూమి ఈ రహదారికి ఇరువైపులా ఉంది. కవులూరు గ్రామాన్ని ఆనుకొని చేపల చెరువులు సైతం పెద్దఎత్తున ఉండడంతో చెరువులలో చేపలకు వేసే మేత సరఫరా, చేపల ఎగుమతి కోసం భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రైతులు తమ వ్యవసాయ భూముల్లో పనుల కోసం ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలతో ఈ రహదారిలో నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రహదారి అధ్వానంగా మారడంతో సాగు భూముల్లోకి వెళ్లాలన్నా, కొండపల్లి వైపు వెళ్లాలన్నా స్థానికులకు తలనొప్పిగా మారింది. మిగిలిన రోడ్డును కూడా సీసీ రోడ్డుగా నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డు నిర్మాణం పూర్తి చేయలేదు



గత ప్రభుత్వంలో మంజూరైన నిధులతో సగానికి పైగా సీసీ రోడ్డును నిర్మించారు. ఏడాదిన్నరగా మిగిలిన రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయకపోవడం దుర్మార్గం. గ్రామస్తులు నరకయాతన పడుతున్నారు. వర్షం పడితే ఎక్కడ గుంత ఉందో కూడా తెలియక ప్రమాదాలు జరుగుతున్నాయి.

– చెరుకూరి శ్రీనివాసరావు, గ్రామస్తుడు, కవులూరు

పొలాలకు వెళ్లాలంటే నరకయాతన



కవులూరు నుంచి శాంతినగర్ వైపు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా మా గ్రామానికి చెందిన వ్యవసాయ భూములు ఉన్నాయి. ప్రతి రోజూ పొలాలకు వెళ్తుంటాం. సగం రోడ్డు వేసి ఆపేయడంతో నరకయాతన పడుతున్నాం. రాత్రి అయితే ఈ రోడ్డుపైకి రావాలంటే భయమేస్తోంది. బుడమేరు వరద వల్ల రోడ్డుపై భారీ గుంతలు పడ్డాయి.

– ఈలప్రోలు రవి, గ్రామస్తుడు, కవులూరు

రోడ్డును వెంటనే బాగు చేయాలి



మా ఊరి నుంచి శాంతినగర్ వెళ్లే రోడ్డును వెంటనే బాగు చేయాలి. సగం రోడ్డు వేసి ఆపడం వల్ల బైకులపై వెళ్లలేకపోతున్నాం. వర్షం పడినప్పుడల్లా రోడ్డుపై గుంతలలో నీరు నిలిచి కిందపడిపోతున్నాం. పొలాలకు వెళ్లాలంటే రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే మిగిలిన రోడ్డు వేయాలి.

– చెరుకూరి గంగయ్య, గ్రామస్తుడు, కవులూరు

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

నూజివీడు: పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తామని సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల నుంచి అధికారులు అర్జీలు స్వీకరిస్తారని చెప్పారు.

ఎమ్మెల్యే మళ్లీ అదే పాట

త్వరలో కట్టలేరుపై వంతెనకు టెండర్లు

తిరువూరు: తిరువూరు నియోజకవర్గంలోని గంపలగూడెం మండలం వినగడప వద్ద కట్టలేరుపై వంతెన నిర్మాణంపై గతంలో ఇచ్చిన హామీనే ఎమ్మెల్యే శ్రీనివాసరావు ఆదివారం పునరుద్ఘాటించారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ వంతెన నిర్మాణ పనులు చేపడతామని ఎన్నికలకు ముందు మేనిఫెస్టోలో ప్రకటించినప్పటికీ ఇంతవరకు తదనుగుణంగా నిధులు మంజూరు చేయించలేకపోయిన ఎమ్మెల్యే ఆదివారం తన అనుచరులతో వంతెన నిర్మించాల్సిన ప్రదేశాన్ని పరిశీలించేందుకు వెళ్లి విలేకరుల సమావేశం నిర్వహించారు. 2, 3 నెలల్లో వంతెన నిర్మాణ పనులకు టెండర్లు పిలిచే అవకాశం ఉందని ప్రకటించారు. ఇటీవల గంపలగూడెం నుంచి వినగడప, కొత్తపల్లి వెళ్లే విద్యార్థులు వాగు దాటుతూ వరదలో చిక్కుకుని ఇబ్బందులు పడిన నేపథ్యంలో గ్రామస్తులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేయడంతో వంతెన నిర్మాణంపై ప్రభుత్వం ఎటువంటి హామీ ఇవ్వకపోయినా, త్వరలో టెండర్లు పిలుస్తారంటూ ఎమ్మెల్యే చెప్పడంపై స్థానికులు పెదవి విరుస్తున్నారు.

87 మందికి వైద్య పరీక్షలు

జి.కొండూరు: కవులూరు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ట్రస్టు భవనంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 87 మందికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి నెలకు సరిపడా మందులు పంపిణీ చేశారు. ప్రతి నెలా రెండో ఆదివారం వైద్య శిబిరం నిర్వహిస్తామని ట్రస్టు ప్రతినిధులు తెలిపారు. డాక్టర్లు ఈశ్వర్, పి.శ్రీవాణి, ట్రస్టు ప్రతినిధులు నవీన్, బాలకృష్ణ, బసవకుమారి, రాజేశ్వరరావు, షీలా పాల్గొన్నారు.

నకిలీ మద్యంపై నేడు వైఎస్సార్ సీపీ నిరసన

ఇబ్రహీంపట్నం: కూటమి ప్రభుత్వంలో నకిలీ మద్యం తయారీ, రాష్ట్ర వ్యాప్తంగా అక్రమ రవాణాకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపడుతున్నామని వైఎస్సార్ సీపీ ఇబ్రహీంపట్నం కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. మైలవరం మండల కేంద్రంలో సోమవారం ఉదయం జరిగే నిరసన కార్యక్రమంలో మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త జోగి రమేష్ పాల్గొంటారన్నారు. నిరసన అనంతరం ఎక్సైజ్ శాఖాధికారులకు వినతిపత్రం అందజేస్తారని చెప్పారు. వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

- **నూజివీడు:** నకిలీ మద్యం అరికట్టి ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరుతూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహిస్తామని మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఉదయం 10 గంటలకు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయం ఉన్న ద్వారకా ఎస్టేట్ వద్దకు కార్యకర్తలు, నాయకులు వస్తే అక్కడి నుంచి ర్యాలీగా ఎక్సైజ్ కార్యాలయం వద్ద వెళ్లి నిరసన ప్రదర్శన అనంతరం ఎక్సైజ్ సీఐకి వినతిపత్రం అందజేస్తారన్నారు.
- **తిరువూరు:** రాష్ట్రంలో నకిలీ మద్యం అమ్మకాలపై వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో సోమవారం తిరువూరులో నిరసన కార్యక్రమం నిర్వహిస్తామని పార్టీ మహిళా విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు పి. సుధారాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు తిరువూరు శాంతినగర్‌లోని పార్టీ కార్యాలయం నుంచి ఫ్యాక్టరీ సెంటర్ వరకు ప్రదర్శన, అనంతరం ఎక్సైజ్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామన్నారు. పార్టీ వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

సుధాలక్ష్మికి బెస్ట్ టీచర్ అవార్డు



అవార్డు అందుకుంటున్న సుధాలక్ష్మి

నూజివీడు: పట్టణంలోని కృష్ణా విశ్వవిద్యాలయానికి చెందిన ఎమ్మార్ అప్పారావు పీజీ కేంద్రంలో రసాయన శాస్త్ర అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న పీబీ సుధాలక్ష్మి సర్వేపల్లి రాధాకృష్ణన్ బెస్ట్ టీచర్ అవార్డును అందుకున్నారు. విజయవాడలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో సొసైటీ ఫర్ లెర్నింగ్ టెక్నాలజీస్ సంస్థ ఈ అవార్డును అందజేసింది.

డివిజన్ అభివృద్ధి కార్యాలయం ప్రారంభోత్సవం ఎప్పుడు?



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న డీడీఓ కార్యాలయ భవనం

నూజివీడు: నూజివీడు డివిజన్ అభివృద్ధి కార్యాలయం ప్రారంభానికి ముస్తాబై నెల రోజులుగా ఎదురుచూస్తోంది. కూటమి ప్రభుత్వం డివిజన్ స్థాయిలో డివిజన్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని(డీడీఓ) ఏర్పాటు చేస్తోంది. గతంలో ఉన్న డివిజనల్ అభివృద్ధి అధికారినే ఈ ప్రభుత్వం డీడీఓగా మార్పు చేసింది. డీడీఓతో పాటు డివిజనల్ పంచాయతీ అధికారి (డీఎల్‌పీఓ), ఉపాధి హామీ ఏపీడీ సైతం ఈ కార్యాలయం నుంచే పనిచేయాల్సి ఉంటుంది. దీంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని పదేళ్ల కిందట నిర్మించిన పాత భవనానికి హుటాహుటిన రూ.10 లక్షలు ఖర్చుచేసి డివిజన్ అభివృద్ధి కార్యాలయంగా ముస్తాబు చేశారు. డీడీఓ, డీఎల్‌పీఓ, ఏపీడీలకు వేర్వేరుగా చాంబర్లను సైతం ఏర్పాటు చేశారు. అక్టోబరు 2న ప్రారంభిస్తారని ప్రచారం జరిగినా ఇంతవరకు కార్యాలయం ప్రారంభం కాలేదు. లక్షలాది రూపాయల ప్రజాధనం ఖర్చు చేసి ముస్తాబైనా ప్రారంభించకపోవడం వెనుక కారణం అంతుబట్టడం లేదు.

రాష్ట్ర ఫుట్ బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం సతీష్, ఉపాధ్యాయులు

మైలవరం: మైలవరం శ్రీ రాజా ఎస్వీఆర్జీఎన్నార్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ముగ్గురు రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు కృష్ణా జిల్లా ఫుట్‌బాల్ టీమ్‌కు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.సతీష్ ఆదివారం తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయిలో జరుగనున్న పోటీలకు గన్నవరంలో జరిగిన సెలక్షన్‌లో తమ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులు మాధవరపు కౌశిక్, పెనుమూడి శ్యాంకుమార్, 9వ తరగతి విద్యార్థి ప్రత్తిపాటి గౌతం ఎంపికయ్యారన్నారు. కడపలో త్వరలో జరుగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని చెప్పారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల దాతలు ఎస్‌వీ సుధాకరరావు, ఎస్‌వీ నివృతరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్. సతీష్, పీడీ శాంతికుమారి, ఉపాధ్యాయులు అభినందించారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

మంత్రి పార్థసారథి



రైతుల సమస్యలు వింటున్న మంత్రి పార్థసారథి

ముసునూరు: గ్రామాల్లోని రైతులు, ప్రజల సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు చేపట్టాలని రాష్ట్ర సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అధికారులను ఆదేశించారు. మండలంలోని చింతలవల్లిలో ఆదివారం సాయంత్రం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా తమ భూములను రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్ చేయడం లేదని కొందరు రైతులు మంత్రి దృష్టికి తెసుకు వచ్చారు. దీనిపై వీఆర్ఓను ఆయన వివరణ కోరారు. భూములు నోషనల్ నుంచి రెగ్యులర్ చేయడం జిల్లా కలెక్టర్ పరిధిలోనిదని, తానేమీ చేయలేనని చెప్పారు. దీనిపై మంత్రి కలెక్టర్‌కు ఫోన్ చేసి గ్రామంలోని భూముల ఆన్‌లైన్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మండవ బుజ్జి, సొసైటీ మాజీ అధ్యక్షుడు నాగం బాబు, టీడీపీ మండల అధ్యక్షుడు రఘుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో అన్నదానం



ఇబ్రహీంపట్నం: గ్యార్మీ పండుగ సందర్భంగా పశ్చిమ ఇబ్రహీంపట్నం మసీదు వద్ద ఆదివారం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సూఫీ మత గురువులు అల్తాఫ్ రజా ముఖ్యఅతిథిగా హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా గౌసే ఆజం చిహ్నమైన జెండా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సర్వ మానవాళికి శాంతి మార్గం సూచించిన మహమ్మద్ ప్రవక్త ముని మనవడు మహబూబ్ సుభాని జ్ఞాపకార్థం గ్యార్మీ పండగ నిర్వహించడం ఆనవాయితీ అన్నారు. కార్యక్రమంలో మసీదు కమిటీ అధ్యక్షుడు షేక్ ముస్తఫా, ఉపాధ్యక్షులు షేక్ సర్వర్ సాహెబ్ కరీముల్లా, అలీఫ్ ఖాన్, కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

తిరువూరు: ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన ఆర్థిక సాయం చెక్కులను తిరువూరు ఎమ్మెల్యే కె. శ్రీనివాసరావు ఆదివారం లబ్ధిదారులకు అందజేశారు. తిరువూరు నియోజకవర్గంలో గత 18 నెలల కాలంలో 677 మంది రోగులకు రూ.4.39 కోట్ల మేర ఈ ఆర్థిక సాయం అందించామని ఎమ్మెల్యే చెప్పారు.

ఘనంగా ఆర్ఎస్ఎస్ శత వార్షికోత్సవం

ముసునూరు: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఏర్పాటుతో సంఘటిత భారత్ నిర్మాణం సుసాధ్యమైందని శ్రీ లలితాకామేశ్వరీ పీఠాధిపతి ఆదిత్య భారతీనంద స్వామీజీ అన్నారు. ఆర్ఎస్ఎస్ శత వార్షికోత్సవం, విజయదశమి ఉత్సవం ముసునూరులోని వాసవీ కల్యాణ మండపంలో ఆదివారం సాయంత్రం నిర్వహించారు. కార్యక్రమాల్లో ప్రముఖ వక్త, విభాగ్ శారీరక్ ప్రముఖ్ శ్రీకాంత్, మండల ప్రతినిధులు గుడివాడ వెంకటేశ్వరరావు, పరమేశ్వరరావు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కోతులు, కుక్కలతో బెంబేలు



నూజివీడులో ఇళ్ల వెంట తిరుగుతున్న కోతులు



నూజివీడులో గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

నూజివీడు: నియోజకవర్గ వ్యాప్తంగా కోతులు, కుక్కల బెడద నిరంతర సమస్యగా తయారైంది. వీధుల్లో ఎక్కడ చూసినా కోతులు, కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తుండటంతో ప్రజలు రాకపోకలు సాగించాలంటే భయాందోళనకు గురవుతున్నారు. మహిళలు, పిల్లలు, వృద్ధులపై కోతులు దాడి చేస్తున్నాయి. కుక్కలు, కోతుల బెడదపై మండల పరిషత్, మున్సిపల్ సమావేశాల్లో ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా, ఈ సమస్యపై అధికారులను నిలదీసినా పరిష్కారం కావడం లేదు.

ఇళ్లల్లోకి చొరబడుతున్న వానరాలు

కోతులు గుంపులు గుంపులుగా తిరుగుతూ ఇళ్ల తలుపులు తీసి ఉంటే ఇళ్లలోకి చొరబడి కూరగాయలు, పండ్లు, అరటి కాయలు, డబ్బాలు బయటకు తీసుకెళ్లి ఆగమాగం చేస్తున్నాయి. డిష్ వైర్లు, కేబుల్ టీవీ వైర్లు, నెట్ వైర్లను తెంపేస్తున్నాయి. పార్కుల్లో వాకింగ్ చేసేవారిపై దాడి చేస్తున్నాయి. పండ్ల తోటల్లో సైతం కోతుల బెడదతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మామిడి తోటల్లో కోతుల బెడద లేకుండా ఉండేందుకు కాపలాదారులను ఏర్పాటు చేసి తోటల్లోకి రాకుండా చర్యలు తీసుకుంటున్నారు.

రోడ్డుపై ఒంటరిగా వెళ్లలేని పరిస్థితి..

కోతులకు తోడు గ్రామాలు, పట్టణాలు అనే భేదం లేకుండా కుక్కల బెడద సైతం ప్రజలను వేధిస్తోంది. వీటి సంతతి రోజురోజుకు ఎక్కువైపోయి రోడ్డుపై ఒంటరిగా వెళ్లాలంటే భయపడేలా తిరుగుతున్నాయి. పాఠశాలలకు వెళ్లేటప్పుడు విద్యార్థులను, ఒంటరిగా వెళ్లే వారిని, ద్విచక్ర వాహనదారుల వెంటబడి హడలెత్తిస్తున్నాయి. ద్విచక్ర వాహనంపై వెళ్తుంటే రహదారులపై వాహనాలను వెంబడిస్తున్నాయి. దీంతో వాహనదారులు భయాందోళనలకు గురవుతున్నారు.

కుక్కలతో ఇబ్బంది పడుతున్నాం



పట్టణంలో కుక్కల గుంపులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ద్విచక్ర వాహనంపై వెళ్తుంటే వెంబడిస్తున్నాయి. దీంతో ఎక్కడ కరుస్తాయోనని మరింత వేగంగా వెళ్లాల్సి వస్తోంది. హఠాత్తుగా మీదకు వస్తుండటంతో కొందరు ప్రమాదాల బారిన పడుతున్నారు.

– యర్రంశెట్టి రవితేజ, నూజివీడు